క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి

గుంటూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు శ్రద్ధగా చేసి, పరిసరాల పరిశుభ్రతకు, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలని జిల్లా పంచాయితీ అధికారి సాయికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చల్లావారిపాలెం, దాసుపాలెం, చిన్నపలకలూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ గురించి పారిశుద్ధ్య కార్మికులకు వివరించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. వారంలో కనీసం రెండుసార్లైనా పారిశుద్ధ్య కార్మికులు వస్తున్నారా ? అని ఆరాతీశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి శుద్ధి యంత్రం ప్రారంభం



గుంటూరు రూరల్: పేద విద్యార్థుల ఉన్నతికి ప్రతి ఒక్కరూ సాయం చేయాలని సానిశెట్టి పురుషోత్తం తెలిపారు. 41వ డివిజన్‌లోని ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పాఠశాలలో గురువారం ఆయన తన తల్లిదండ్రులు సానిశెట్టి వెంకయ్య, వెంకాయమ్మల జ్ఞాపకార్థం రూ. 85 వేలతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్ రోజుకి రెండువేల లీటర్ల నీటిని శుద్ధి చేసి అన్ని రకాల పోషకాలతో విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పురుషోత్తం కుటుంబసభ్యులు సుభద్ర, సతీష్, దుర్గాదేవి, లక్ష్మీప్రియ, శరణ్, హ్యాపీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పంచుమర్తి కోటేశ్వరరావు, ఆశోక్‌బాబు, బి. శ్రీనివాస్, నరసింహారావు, కైలాష్, పాఠశాల సెక్రటరీ ఎం. ఉపేంద్ర, ప్రిన్సిపాల్ ఎస్. తాండవకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె. దివ్య పాల్గొన్నారు.

9న మెగా జాబ్ మేళా



నెహ్రూనగర్: స్మార్ట్ టెక్స్, జీఎంసీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, అందులో భాగంగా ఈ నెల 9న స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మాక్ ఇంటర్వ్యూ, రిజిస్ట్రేషన్ జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం స్మార్ట్ టెక్స్ చైర్‌పర్సన్ దివ్యతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా జాబ్ మేళా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఈనెల 4వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం అంకురార్పణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, మంగళా శాసనం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు ప్రత్యేక అలంకారాలు ఉంటాయని వివరించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం భజన, కోలాటం, విశేష పారాయణాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో గురువారం కిండర్ గార్టెన్ కిడ్స్‌కు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు యూనివర్సిటీల్లోని గ్రాడ్యుయేట్ల మాదిరిగా గౌన్లు, టోపీలు ధరించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌కు చెందిన డాక్టర్ మంచికంటి అనూరాధ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఇన్‌చార్జ్ సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రాజకీయ గ్రహణం

- జడవల్లి పంచాయతీని ఆదుకునేదెవరు ?
- ఆరు నెలలుగా నిలిచిన కార్మికుల జీతాలు
- పనులకు ఆగిన బిల్లులు
- ప్రేక్షకపాత్రలో మండల పరిషత్ అధికారులు



జడవల్లి పంచాయతీ కార్యాలయం

పొన్నూరు: కూటమి ప్రభుత్వం రాకతో పలు గ్రామాల్లో అభివృద్ధి స్తంభించిపోయింది. పాలనలో రాజకీయ జోక్యంతో పలు పంచాయతీల మనుగడ సాగడం లేదు. గ్రామాభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడం లేదు. కనీసం పంచాయతీ కార్మికుల జీతాలకు కూడా దిక్కులేదు. సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి సహకారం అందించాల్సిన మండల పరిషత్ అధికారులు సైతం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అదనపు నిధులను మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాల్సి పోయి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. చేసిన పనుల బిల్లులు, కార్మికుల జీతాలకు అడ్డుపడుతూ గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టినా ఫలితం సున్నా

కూటమి ప్రభుత్వ సవతి తల్లి ప్రేమకు మండల పరిధిలోని జడవల్లి పంచాయతీ అద్దం పడుతోంది. పంచాయతీలో చిల్లి గవ్వలేదు. ఆదుకునేవారు కూడా కరువయ్యారు. ఆరు నెలలుగా కార్మికుల జీతాలు ఇవ్వడం లేదు. ఏడాది నుంచి సర్పంచ్ వేతనం అందడం లేదు. సాధారణ నిధులు రూ.1,13,620తో చేపట్టిన పనుల బిల్లులు రాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2,77,708తో చేపట్టిన సీసీ డ్రెయిన్లు, తాగునీటి పనులు, రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాక పంచాయతీ అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. బిల్లులు చెల్లించాలని మండల అధికారులను మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించడం లేదు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేసి, గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని, రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఇందిరా ప్రియదర్శిని గత నెల 24వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేశారు. అర్జీ ఇచ్చి పది రోజులు దాటినా సమస్యకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. దీనిపై ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావును వివరణ కోరగా జడవల్లిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

ఉన్నతాధికారులు స్పందించాలి



పంచాయతీలో కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో గ్రామంలో సమస్యలను పరిష్కరించలేకపోతున్నాం. మండల పరిషత్ అధికారులకు విన్నవించినా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీకి నిలిచిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

– ఇందిరా ప్రియదర్శిని, సర్పంచి, జడవల్లి

ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండ గడదాం

ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, పేదలపై నిర్లక్ష్యాన్ని ఎండగట్టి, ప్రతి కుటుంబానికీ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్ కుమార్ తెలిపారు.ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలసాని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు మోసం చేసిందని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించకుండా వారి సొమ్మును దోచుకుంటుందని మండిపడ్డారు. ఎక్కడపడితే అక్కడ అక్రమ మైనింగ్‌లు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. కూటమి కుట్రపూరిత కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్తా, నాయకుడు కృషిచేయాలని చెప్పారు. కార్పొరేషన్‌ల రుణాల పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మండలానికి అందులోనూ అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే రుణాలు అందించే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. పేదలకు అందాల్సిన పథకాలను కేవలం కూటమి పార్టీ నాయకులకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాలను పార్టీ నేతలతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం


అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మహిళలు ధైర్యాన్ని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటే ప్రతి సమస్యను సులువుగా పరిష్కరించుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ అడ్వకేట్ పి. కల్యాణి తెలిపారు.చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కల్యాణి మాట్లాడుతూ లింగ వివక్ష విడనాడితేనే సంఘ అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుందని తెలిపారు. మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న పలు కఠిన చట్టాలు, శిక్షలను వివరించారు. మహిళలు అత్యున్నత పదవుల్లో తమ సామర్థ్యాన్ని నిరూపిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు విజ్ఞానంతో పాటుగా న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని తెలిపారు. మహిళాశక్తి సమాజాభివృద్ధికి పునాది అని కళాశాల కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, జి. సుధావాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. చివరగా అతిథులను ఘనంగా సన్మానించారు.

అందని ద్రాక్షగా కార్పొరేషన్ రుణాలు

- మండలం మొత్తం 60 మందికే మంజూరు
- అర్జీలు పెట్టుకున్న 800 మందికి పైగా ఆశావహులు


క్రెడిట్ క్యాంపులో పాల్గొన్న అధికారులు

గుంటూరు రూరల్: కార్పొరేషన్ రుణాలు అందని ద్రాక్షగా మారాయి. క్రెడిట్ క్యాంపుల నిర్వహణపై దరఖాస్తుదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రూరల్ మండలంలోని బీసీ, ఈడీసీ, కాపు కార్పొషన్‌ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు క్రెడిట్ క్యాంపును నిర్వహించారు. బ్యాంకు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలవ్యాప్తంగా 11 గ్రామాలకు గానూ 60 రుణాలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండు లక్షల మందికి పైగా ప్రజలున్న మండలంలో 60 మందికి మాత్రమే రుణాలను పొందే అర్హత కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక రుణాలు వచ్చినట్టేనని నిరాశను ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు వ్యక్తం చేశారు. పేదలంతా పథకాలకు అర్హులు కాదా ? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రభుత్వం కావాలని అధికార పార్టీ నాయకులకే రుణాలు అందేలా చేయటమేనని ఆరోపించారు. క్రెడిట్ క్యాంపుల పేరుతో కొందరికే రుణాలు అందజేయటంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, బ్యాంకుల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రుణ' బాధలు ఇంతింత కాదయా ...!


ఉదయం 11 గంటలకు కూడా ప్రారంభం కాని ఇంటర్వ్యూలు


ఖాళీగా దర్శనమిస్తున్న టెంట్లు

- దరఖాస్తుదారులకు చుక్కలు
- బీఆర్ స్టేడియంలో ఎండలో అవస్థలు
- 3,141 మందికి గానూ 1500 మాత్రమే హాజరు
- తమ వారిని ఫోన్లు చేసి పిలిపించుకున్న కూటమి నేతలు

నెహ్రూనగర్: బీసీ కార్పొరేషన్ ద్వారా గురువారం తూర్పు నియోజకవర్గ పరిధిలో సబ్సిడీ రుణాల దరఖాస్తులను పరిశీలించడానికి బీఆర్ స్టేడియంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్‌లో సరైన వసతులు లేకపోవడంతో దరఖాస్తుదారులతో పాటు ఉద్యోగులు ఎండలో మండిపోయారు. అధికారులు షామినాలు ఏర్పాటు చేసి దులుపుకున్నారు. ఉదయం 10 గంటలకు కల్లా రావాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించడంతో దరఖాస్తుదారులు ముందే స్టేడియం వద్దకు చేరుకున్నారు. అధికారులు మాత్రం తీరిగ్గా ఉదయం 11 గంటలకు వచ్చారు. శిబిరం వద్ద కూటమి నేతలు తిష్ట వేశారు. దగ్గరుండి తమ అనుకునే వారికి ఫోన్లు చేసి మరి పిలిపించుకున్నారు. వారి పేర్లను ఎమ్మెల్యే కార్యాలయానికి పంపించినట్లు సమాచారం.

సగం మంది కూడా హాజరుకాని దరఖాస్తుదారులు

గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 3,141 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గురువారం సాయంత్రానికి 1,500 మాత్రమే వచ్చినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. కనీసం క్యాంప్‌ను రెండు రోజులు పెట్టిన బాగుండేది కదా అని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో దరఖాస్తుల పరిశీలన

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో క్రెడిల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కాపీ, విద్యార్హతలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, పాన్, ఆధార్ కార్డుల ఫొటోస్టాట్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో హాజరుకావాలని ఆయన సూచించారు

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులను తీర్చలేక పోతున్నానంటూ మనోవేదనతో ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేట 5వ లైన్‌కు చెందిన పెమ్మసాని జనార్దన్ (34) బిర్యానీ పాయింట్‌లో వెయిటర్‌గా పని చేస్తాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులతో సతమతమవుతూ మనోవేదనతో బుధవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఆసుపత్రికి వెళ్లి జనార్దన్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. అయితే, గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వృద్ధుడికి చేయూత

మానవత్వం చాటుకున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మానవత్వాన్ని చాటుకున్నారు. ఏలూరు ప్రాంతానికి చెందిన బలంకి అప్పారావు (79) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చూసేవారు లేక ఇబ్బందులు పడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న నూరి ఫాతిమా ఆయనకు అండగా నిలిచారు. పాత గుంటూరులోని ఆర్‌ఆర్ మూర్తి వృద్ధుల సేవా సంస్థలో చేర్పించారు. తానే గార్డియన్‌గా ఉంటానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ ఆర్.ఆర్. మూర్తి వృద్ధుల సేవా సంస్థ శ్రద్ధ, వైద్య సేవలు చూసి వృద్ధుడిని ఇక్కడ చేర్పించినట్లు తెలిపారు. గతంలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కూడా ఐదుగురిని ఇక్కడ చేర్పించినట్లు చెప్పారు. వృద్ధుడి పూర్తి బాధ్యతలు తానే స్వీకరిస్తానని ఆమె తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్ ప్రారంభం

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు శిక్షణ ఉంటుందని, విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. తమ కళాశాలలో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు 262 మందికిగానూ 252 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు కళాశాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ కిరణ్మయికి సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది విధుల్లో చేరిన చిలువూరి కిరణ్మయిని గురువారం మచిలీపట్నం జీజీహెచ్ గ్రేడ్ –1 నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, నర్సింగ్ వృత్తికి వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సిబ్బంది, నర్సుల సంఘం నేతలు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


ఆలయ కమిటీతో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయంలో మహా కుంభాభిషేకం, సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహం, అగ్ని ధ్యానం, మహా శాంతి కుంభ అభిమంత్రణం, విశేష హోమం, సాయంత్రం ఉత్సవమూర్తులకు విశేష పంచామృత స్నపన, మహాశాంతి హోమం, శయనాధివాసం తదితర పూజలను ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు అల్లం సాంబశివరావు, కార్యదర్శి శింగంశెట్టి శివశంకర్, ఉపాధ్యక్షులు అప్పికట్ల వెంకటేశ్వరరావు కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, మూర్తి రాజు, పి. శ్యాం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా స్కాలర్‌షిప్ టెస్ట్‌ల నిర్వహణ

- కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన
- టెస్ట్‌ల నిర్వహణ నిలిపివేసిన ఇంటర్ బోర్డ్ అధికారులు


కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: అనుమతులు లేకుండా మండలంలోని పెదపలకలూరులో గల సంకల్ప జూనియర్ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్‌లను నిర్వహిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆరోపించారు. ఇంటర్ బోర్డ్ అనుమతులు లేకుండా గురువారం కళాశాల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆకర్షించడానికి స్కాలర్‌షిప్ టెస్ట్ పేరుతో నిర్వహిస్తున్న పరీక్షలను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం జిల్లా (ఆర్ఐఓ) ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు కళాశాల వద్దకు చేరుకుని స్కాలర్‌షిప్ టెస్ట్‌ని నిలిపివేశారు. కళాశాలపై ఉన్నత అధికారులతో సమీక్ష జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా కళాశాలలు నిర్వహిస్తున్న టెస్ట్‌లపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అపోహలను నమ్మి మోసపోవద్దని విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఐతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ తదితరులు

చేబ్రోలు: ఏఐ, నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ అన్నారు. మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో "రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయోఇన్ఫర్మేటిక్స్ అండ్ బయోటెక్నాలజీ" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బికాస్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా పెద్ద సవాలుగా నిలిచిందని తెలిపారు. ఏఐ, నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. పుదుచ్చేరిలోని ఐసీఎంఆర్ వెక్టర్ కంట్రోల్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ నందకుమార్ యెల్లపు మాట్లాడుతూ కంప్యూటేషనల్ వైద్య విజ్ఞానం సమ్మిళితంగా, వ్యక్తిగత వైద్య శాస్త్రాన్ని మరింత అభివృద్ధి చేస్తోందని తెలిపారు. రోగులను అనుకూలమైన చికిత్సను అందించే దిశగా నడుస్తోందని చెప్పారు. గుజరాత్‌లోని బేస్‌సాల్వ్ ఇన్ఫర్మేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిత్య నారాయణ్ సరంగి మాట్లాడుతూ ఆధునిక జీవసాంకేతిక పద్ధతులు భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశం ఉందని తెలిపారు. విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటిజం ముందస్తు గుర్తింపుతో మెరుగైన జీవితం


బాలికను పరీక్షిస్తున్న డాక్టర్ సుజిత

గుంటూరు మెడికల్: ఆటిజాన్ని ముందస్తుగా గుర్తించడం ద్వారా పిల్లల్లో మెరుగైన జీవితాన్ని పెంపొందించవచ్చని పాజిటివ్ రిహాబ్ సెంటర్ నిర్వాహకులు, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు సుజిత అన్నారు. వరల్డ్ ఆటిజం డే సందర్భంగా స్థానిక చంద్రమౌళీనగర్‌లోని సెంటర్‌లో గురువారం తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజిత మాట్లాడుతూ ఆటిజాన్ని బాల్యంలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. థెరఫీ ద్వారా పిల్లల సామర్థ్యాన్ని కూడా పెంచవచ్చని తెలిపారు. పిల్లలు ఇతర పిల్లలతో కమ్యూనికేషన్‌లో లోపం, పరస్పర సంబంధాల్లో అవగాహన లోపం, పునరావృతంగా చేసే చర్యలు, ఆటలు, దృష్టిలో సమస్యలు, కొన్ని ప్రత్యేకమైన విషయాలపై ఎక్కువ మక్కువ చూపిస్తుంటే ఆటిజం లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైన్ షాపు ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



పట్నంబజారు: నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందివెలుగు రోడ్డులోని జెండా చెట్టు సెంటర్ సమీపంలో లక్కీ వైన్స్ పేరుతో గురువారం రాత్రి విక్రయాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానికులు ఇళ్ల మధ్య షాపు ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆందోళనకు దిగారు. ధర్నా చేపట్టి, పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు అక్కడకు చేరుకుని వైన్స్ నిర్వాహకులు, స్థానికులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనబడలేదు. నియోజకవర్గ ఎమ్మెల్యే వచ్చి సమాధానం చెప్పాలంటూ స్థానికులు భీష్మించి కూర్చున్నారు. గంట తరువాత ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అక్కడకు చేరుకున్నారు. వైన్స్ షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటానని స్థానికులకు చెప్పడంతో వివాదం సద్దు మణిగింది.